క్లుప్తంగా

రాములోరి కల్యాణానికి పందిరి రాట



వేపాడ రామాలయంలో పందిరి రాట

వేపాడ: మండలంలోని పలు గ్రామాల్లో రామాలయాల్లో శ్రీరామనవమి కల్యాణోత్సవం సందర్భంగా శుక్రవారం పలు రామాలయాల వద్ద పందిరిరాట ఉడుపు కార్యక్రమం నిర్వహించారు. వేపాడలో అర్చకులు గోపాజోస్యుల సాయిరాంశర్మ, దబ్బిరాజుపేట, బక్కునాయుడుపేట తదితర గ్రామాల్లో గ్రామ పురోహితులు మంత్రోచ్ఛరణాలతో నేరేడు రాటను వేశారు. ఆదివారం శ్రీరామ నవమి సందర్భంగా సీతారాముల కల్యాణం, అన్న సమారాధనలు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



శిక్షణలో మాట్లాడుతున్న స్త్రీనిధి మేనేజరు అరుణ

బొండపల్లి: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని స్త్రీనిధి మేనేజరు అరుణ అన్నారు. స్థానిక వెలుగు సమాఖ్య కార్యాలయంలో వీఓఏలు, ఎన్యుమరేటర్లకు శుక్రవారం శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం తన వంతు చేయూతనిస్తుందన్నారు. ఉత్సాహవంతులైన మహిళలను గుర్తించి వారికి ఇష్టమైన రంగాన్ని గుర్తించి ఆ దిశగా ఆర్థికాభివృద్ధి సాధించేలా చర్యలు చేపట్టాలన్నారు. వెలుగు ఏపీఎం కె.పెంటం నాయుడు, సీసీలు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

డోలపాలెంలో అఖండ రామభజన



రామమందిరంలో అఖండ భజనలో పాల్గొన్న భక్తులు

గజపతినగరం రూరల్: గడిచిన వారం రోజులుగా మండలంలోని డోలపాలెం గ్రామ రామ మందిరంలో శ్రీరామనామ సంకీర్తనలతో అఖండ భజనలను స్థానిక భక్తులు నిర్వహిస్తున్నారు. ఆదివారం శ్రీరామనవమిని పురస్కరించుకుని రోజుకోక బృందం చొప్పున పది మంది భక్తులు స్వామివారి కీర్తనలను ఆలపించడం జరుగుతుందని తెలిపారు. నవమి రోజున శ్రీసీతారాములు కల్యాణంతో పాటు భక్తులకు అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని వారు తెలిపారు.

ఆనందపురంలో వైద్య శిబిరం



శిబిరంలో రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

గుర్ల: మండలంలోని ఆనందపురంలో నవభారత యువజన సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రానికి చెందిన తిరుమల ఆసుపత్రి వైద్యులతో శుక్రవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్య శిబిరాన్ని జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్ వర్మ ప్రారంభించారు. కార్పొరేట్ ఆసుపత్రులు గ్రామాల్లో పేదల వద్దకు వచ్చి వైద్యం అందించడం శుభపరిణామన్నారు. 150 మందికి వైద్యాధికారి విష్ణు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు.

అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే



బీటీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

గుర్ల: మండలంలోని దమరసింగిలో అభివృద్ధి పనులను ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు శుక్రవారం ప్రారంభించారు. దమరసింగి నుంచి చనమల్లుపేట వరకు రూ.కోటి 80 లక్షలు , గ్రామంలో ఉపాధి హామీ నిధులు రూ.14 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. కూటమి ప్రభుత్వంలో ప్రతి గ్రామంలో సీసీ రోడ్లుతో పాటు అభివృద్ధి పనులను వేగవంతంగా చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

కళ్లు మూసుకున్నాం.. కానిచ్చేయండి...!



పోతనాపల్లి కృష్ణంరాజు చెరువులో సాగుతున్న మట్టి తవ్వకాలు

శృంగవరపుకోట: 'మేము కళ్లు మూసుకున్నాం.. మీ పని మీరు కానిచ్చేయండి...' అంటూ ఇరిగేషన్ శాఖ అధికారులు యథేచ్ఛగా అధికార పార్టీ అనుయాయులకు అండ ఇవ్వటంతో మట్టి మాఫియా చెలరేగుతోంది. మండలంలోని పోతనాపల్లి గ్రామంలో రోడ్డుకు 100మీటర్ల దూరంలో ఉన్న కృష్ణంరాజు చెరువులో అనునిత్యం మట్టి తవ్వకాలు పెద్ద ఎత్తున జరుగుతున్నారు. తరువాత ఇక్కడ నుంచి తవ్విన మట్టిని యథేచ్ఛగా తరలించేస్తున్నారు. ఈ తవ్వకాలను అడ్డుకోవాల్సిన అధికారులు తమకు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ఇందులో ఎవరి వాటాలు వారికి అందుతున్నట్టు సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. అందుకే కళ్లు మూసుకుని కూర్చుంటున్నారని స్థానికులు దుయ్యబడుతున్నారు. అధికార పార్టీ అనుచరుల ఆగడాలు అధికారులకు కనిపించడం లేదా? అని వారు ప్రశ్నిస్తున్నారు. అధికారుల అండతోనే మట్టి మాఫియా చెలరేగిపోతోందని ఆగ్రహిస్తున్నారు. చెరువులు తమ సొంత జాగీరుల్లా జేసీబీలు పెట్టి రాత్రిపగలు తవ్వకాలు చేస్తూ ఇటుక బట్టీలకు అమ్ముకుంటున్నారు. ఇదే సమయంలో పునాదులు నింపేందుకు, లేఅవుట్లు చదును చేసేందుకు కూడా ఈ మట్టిని వాడుకుంటున్నారని స్థానికంగా చర్చ జరుగుతోంది. చెరువుల్లో మట్టిన నిత్యం వందల టన్నుల్లో తవ్వేసుకుంటూ జేబులు నింపుకుంటున్నారు. ప్రభుత్వ ఖజానాకు కన్నం పెడుతున్నారు. అధికార పార్టీ అండతోనే మట్టి మాఫియా నడుస్తోందని.. అందుకే అటుగా అధికారులెవరూ కన్నెత్తి చూడడం లేదని విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి.

కల్లుగీత కార్మికులకు అన్యాయం



మాట్లాడుతున్న జిల్లా కల్లు గీత కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు అప్పారావు

గజపతినగరం: ఎన్నికల సమయంలో కల్లుగీత కార్మికులను అన్ని విధాలుగా ఆదుకుంటామని చెప్పిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చాక హామీలను మరచి మోసం చేస్తున్నారని జిల్లా కల్లుగీత కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు పురం అప్పారావు అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గజపతినగరం మండలం ఎం.కొత్తవలస గ్రామానికి చెందిన భోగాది సత్యం(53) కల్లు తీసేందుకు చెట్టెక్కి జారి పడడంతో మృతి చెందారని, ఆయన కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి పది నెలలు కావస్తున్నా జిల్లాలో సుమారు 20 మందికి పైగా ఎక్స్‌గ్రేషియాలు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. కల్లుగీత కార్మికులను ఆదుకునేందుకు మద్యం షాపులు ఏర్పాటు చేసేందుకు 20 శాతం వరకు అవకాశం కల్పిస్తామని చెప్పి పది శాతం వరకు కుదించి మోసం చేసిందని పురం అప్పారావు ధ్వజమెత్తారు. ఆయన వెంట కల్లు గీత కార్మికులు అప్పలనాయుడు, పైడి రాజు, కె.సత్యం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల విగ్రహాల ప్రతిష్ఠ

బొండపల్లి మండలంలోని గొల్లలపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామాలయంలో సీతారాముల విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రతిష్ఠించనున్న విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో వేదపండితులు ఆధ్వర్యంలో విగ్రహాలను ప్రతిష్ఠించారు. మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించగా వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం కోలాటం, తప్పెటగుళ్ల ప్రదర్శనలను ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఇసరపు శేఖర్ యాదవ్ హాజరై పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, నిర్వాహక కమిటీ సభ్యులు పాల్గొన్నారు. – బొండపల్లి



ఉత్సవమూర్తుల ఊరేగింపు

దత్తిరాజేరు మండలంలోని భూపాలరాజపురంలో సుందర రామందిరం ప్రతిష్ఠాపన కార్యక్రమాలు శుక్రవారం సాయంత్రం అంగరంగ వైభవంగా ప్రారంభం అయ్యాయి. మూడు రోజులు పాటు అనకాపల్లి జిల్లా కశింకోటకు చెందిన రేజేటి రామాచార్యులు వారి పర్యవేక్షణలో వారి కుమారులు సాతారామాచార్యులు అధ్వర్యంలో తొలి రోజు సీతారామ, లక్షణ, శ్రీలక్ష్మీ గణపతి శిలా విగ్రహాల ఊరేగింపు కార్యక్రమాలు గ్రామ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో జరిగాయి. రెండవ రోజు శనివారం హోమం విశేష పూజలు నిర్వహించి మూడవ రోజు ఆదివారం 11.52 నిమిషాలకు పునర్వసు నక్షత్ర యుత మిధున లగ్నమందు విగ్రహాలు ప్రతిష్టించనున్నారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించనున్నారు. – దత్తిరాజేరు



పంచాయతీలో షాపుల వేలం



షాపుల వేలం పాట వేస్తున్న సర్పంచ్ ఎర్రయ్యరామస్వామి, ఈఓ శైలజ తదితరులు

కొత్తవలస: మండల కేంద్రం కొత్తవలస మేజర్ పంచాయతీ పరిధిలో గల వైఎస్సార్ షాపింగ్ మాల్ బ్లాక్ 1, 2, 3 షాపులు, ఉత్తరం దిశ షాపులు మొత్తంగా 26 షాపులను నెలవారి అద్దెలకు పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్యరామస్వామి అధ్యక్షతన ఈఓ బెహరా శైలజ ఆధ్వర్యంలో శుక్రవారం వేలం పాట నిర్వహించారు. వేలం పాటలో 66 మంది పాల్గొన్నట్లు ఈఓ శైలజ తెలిపారు. వీరిలో 26 మంది 26 షాపులను దక్కించుకున్నట్లు తెలిపారు. ఈ 26 షాపుల మొత్తానికి నెలకు రూ.4,97,100ల చొప్పున అద్దె చెల్లించుటుకుగాను దక్కించుకున్నారు. 2026 మార్చి 31వ తేది వరకు ఒప్పందంపై షాపులను తీసుకున్నట్లు ఆమె తెలిపారు. కాగా ఆరు నెలల అద్దెను ముందుగా ఈ నెల 7వ తేదీలోగా చెల్లించాలని అద్దెదారులకు సూచించారు. చెల్లించకుంటే వేలం పాట రద్దు చేస్తామని తెలిపారు. ఇదే షాపింగ్ మాల్‌లో గల 7 షాపులకు సంబంధించి గతంలో వేలం పాటలో దక్కించుకున్న వారు రూ.53,09,064లు అద్దె బకాయిలు వున్నాయని వీరిపై త్వరలో కోర్టులో దావాలు వేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఈఓ పీఆర్‌డీ శ్రీదేవి, మాజీ సర్పంచ్ గొరపల్లి శివ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన

గజపతినగరం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల అభ్యసనా స్థాయిలను ఉపాధ్యాయులు మెరుగు పడేలా చూడాలని ఉప విద్యాశాఖాధికారి కె.మోహన్‌రావు అన్నారు. మండలంలోని పురిటిపెంట న్యూకాలనీ ప్రాథమిక పాఠశాలను ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సులభతరమైన పద్ధతిలో బోధన చేసి విద్యార్థులను ఆకట్టుకోవాలని సూచించారు. తరువాత మండల కేంద్రంలో ఉన్న భవిత కేంద్రాన్ని పరిశీలించారు. అందులో ప్రత్యేక అవసరాల పిల్లల అభ్యసనా స్థాయిలను ఆయన పరిశీలించారు.



పాఠశాలలో విద్యార్థుల అభ్యసనా స్థాయిలను పరిశీలిస్తున్న డిప్యూటీ ఈఓ మోహన్‌రావు

ప్రత్యేక అవసరాల పిల్లలకు అన్ని రకాలుగా మెరుగైన బోధనతో పాటు ఫిజియోథెరపి సేవలను అందించి వారిని మంచిగా తయారు చేయాలని ఆదేశించారు. హెచ్ఎం ఎస్.సుజాత, ఐఈఆర్‌టీ ఉపాధ్యాయుడు వై.శ్రీనివాసరావు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సేవలతోనే గుర్తింపు

గుర్ల: ఉద్యోగులకు సేవలే గుర్తింపునిస్తాయని జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు పొట్నూరు సన్యాసినాయుడు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కె.వి.సూర్యనారాయణ రాజు అన్నారు. మండలంలోని కోటగండ్రేడు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడుగా పని చేసి ఉద్యోగ విరమణ చేసిన బొమ్మన ఈశ్వరరావును శుక్రవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తోట తిరుపతిరావు, ఎంఈఓ ఎస్.భానుప్రకాష్ రావు, సర్పంచ్ ముద్దాడ ప్రసన్న కుమారి తదితరులు పాల్గొన్నారు.



ఈశ్వరరావును సత్కరిస్తున్న జెడ్పీటీసీ అప్పలనాయుడు తదితరులు

గోవుల అక్రమ తరలింపుపై చర్యలు చేపట్టాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత

గంట్యాడ: గోవులను అక్రమంగా తరలించే వారిపై కేసులు నమోదు చేయాలని గో సంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామవరం హైవే మీదుగా కంటైనర్లు, లారీల్లో ఆవులను, దూడలను తరలిస్తున్నారని ఆరోపించారు. గో మాంసం కూడా మండలంలో ఎక్కువగా విక్రయిస్తున్నారని, అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో సత్యనారాయణ, రాజకుమారి, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

మెరకముడిదాం: మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ తాడ్డి కృష్ణవేణి అధ్యక్షతన శనివారం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ జి.భాస్కరరావు తెలిపారు. సమావేశానికి జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు హాజరు కానున్నారని ఎంపీడీఓ తెలిపారు. సమావేశానికి సభ్యులతో పాటు అధికారులు హాజరు కావాలని కోరారు.

గుండెనొప్పితో గీత కార్మికుడు మృతి

గజపతినగరం రూరల్: మండలంలోని ఎం.కొత్తవలస గ్రామానికి చెందిన బోగాది సత్యం శుక్రవారం తెల్లవారుజామున కల్లుగీత అనంతరం గుండె నొప్పి రావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు గజపతినగరం ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు. గజపతినగరం ఏరియా ఆసుపత్రి వైద్యులు ఇచ్చిన పోస్టుమార్టం నివేదిక ప్రకారం గుండె నొప్పి రావడంతోనే సత్యం మృతి చెందాడని ఎస్ఐ పేర్కొన్నారు. అయితే మృతుడి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.



మృతి చెందిన సత్యం

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



దత్తిరాజేరు: శిక్షణలో మాట్లాడుతున్న డీపీఎం మూర్తి



మెరకముడిదాం: మాట్లాడుతున్న ఏపీడి సావిత్రి



చీపురుపల్లి రూరల్ (గరివిడి): శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏపీడీ

దత్తిరాజేరు: గ్రామాలలో ఉన్న పొదుపు సంఘాలు మహిళలు తీసుకొన్న రుణాల ద్వారా వ్యాపారాలు చేసి ఆర్థికంగా ముందుండాలని డీపీఎం మూర్తి అన్నారు. వెలుగు కార్యాలయంలో ఏపీఎం అప్పలనాయుడు అధ్యక్షతన మూడో రోజు జరిగిన శిక్షణ కార్యక్రమంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. స్వయం సహాయక సంఘం సభ్యులకు వార్షిక రుణాలు ఇప్పించడం ఆ నిధులతో జీవనోపాధి ప్రణాళికలు సిద్ధం చేసుకొనే విధానాలపై వీఓఏలు, ఎన్యూమరేటర్లు సభ్యులకు అవగాహన కల్పించాలని సూచించారు.

ప్రణాళికలు సిద్ధం చేయాలి

మెరకముడిదాం: మహిళలు జీవనోపాదులను పెంచేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని ఏపీడీ సావిత్రి వీఓఏలను ఆదేశించారు. దీనికి సంబంధించి మండలానికి చెందిన వీఓఏలకు, ఎన్యూమరేటర్లకు నిర్వహించనున్న శిక్షణ తరగతులను శుక్రవారం ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో ఏసీ బంగారమ్మ, ఎఫ్‌పీఓ రాజశేఖర్, ఏపీఎం ధనలక్ష్మి, సీసీలు, పలువురు వీఓఏలు పాల్గొన్నారు.

సంఘాల బలోపేతానికి ప్రణాళికలు

వేపాడ: స్వయం సహాయక సంఘాలు బలోపేతం చేయటానికి అవసరమైన ప్రణాళికలతో వీఓఏలు ఎన్యూమరేటర్లకు వార్షిక రుణ జీవనోపాధిపై అవగాహన కల్పించారు. శుక్రవారం ఐకేపీ ఏపీఎం డి.సూర్యనారాయణ నేతృత్వంలో నిర్వహించిన ఒక రోజు అవగాహన కార్యక్రమంలో సంఘాలు బలోపేతంపై వివరించారు. కార్యక్రమంలో సీసీలు, వీఓఏలు, ఎల్‌సీసీసీ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

చీపురుపల్లి రూరల్(గరివిడి): సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి చెందటానికి వార్షిక రుణ, జీవనోపాధుల శిక్షణ దోహదపడుతుందని డీఆర్‌డీఏ ఏపీడీ కె.సావిత్రి అన్నారు. గరివిడి మండల సమాఖ్య కార్యాలయంలో వార్షిక రుణ, జీవనోపాదుల ప్రణాళికపై వీఓఏలకు, ఎన్యూమరేటర్లుకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. కార్యక్రమంలో డీపీఎం జి.సీతారామయ్య, ఏపీఎం పి.నారాయణ రావు, సీసీలు పాల్గొన్నారు.



వేపాడ: శిక్షణలో రుణ ప్రణాళికపై అవగాహన కల్పిస్తున్న ఐకేపీ అధికారులు

ఏఎంసీ చైర్మన్‌గా గోపాలరాజు

గజపతినగరం రూరల్: మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా ఎం వెంకటాపురం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు పీవీవీగోపాలరాజును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేసింది. ఈ మేరకు సంబంధిత ఉత్తర్వులు తనకు అందినట్టు గోపాలరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు మార్కెట్ కమిటీ ద్వారా తన వంతు సేవలు అందిస్తానన్నారు. పార్టీ నాయకులతో పాటు అభిమానులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి



కోటగండ్రేడులో ఇళ్ల నిర్మాణాల వివరాలను తెలుసుకుంటున్న ఎస్ఈ రామచారి

గుర్ల: గృహ నిర్మాణాలను వేగవంతం చేసేందుకు ప్రతి లబ్ధిదారుడుకు అదనంగా రూ.50 వేలను ప్రభుత్వం పెంచినట్లు గృహనిర్మాణ శాఖ ఎస్ఈ జె.రామచారి తెలిపారు. మండలంలోని కోటగండ్రేడులో గృహ నిర్మాణాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడుతూ మధ్యలో నిలిపివేసిన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని అన్నారు. గతంలో ఇళ్ల నిర్మాణానికి రూ.లక్షా80 వేలు ఉండేదని, ఇప్పుడు దానికి ఆదనంగా మరో రూ.50వేలను పెంచడం జరిగిందన్నారు. ఆయన వెంట గృహ నిర్మాణ శాఖ పీడీ మురళీమోహన్, డీఈ రత్నాకర్ ఉన్నారు.

భోజనంలో రుచి, నాణ్యత పాటించాలి

వేపాడ: మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు భోజనం మెనూ కచ్చితంగా పాటించాలని ఎంఈఓ బాల భాస్కరరావు అన్నారు. కొత్తబొద్దాం, బొద్దాం, పాటూరు ప్రాథమిక పాఠశాలలను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల వర్క్‌బుక్స్, లెసెన్‌ప్లాన్ పరిశీలించడంతో పాటు చతుర్విత ప్రక్రియలు విద్యార్థులచే చేయించారు. అనంతరం పాటూరులో ఎండీఎం భోజనం పరిశీలించి విద్యా ర్థులతో సహపంక్తి భోజనం చేశారు. మూడు పాఠశాలల్లో కిచెన్ గార్డెన్స్ పరిశీలించారు.



పాటూరు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో సహపంక్తి భోజనం చేస్తున్న ఎంఈఓ